క్లుప్తంగా

సెల్ ఫోన్ రికవరీ



సెల్‌ఫోన్ అందుకుంటున్న హరిబాబు

సంతమాగులూరు (అద్దంకి): ఏప్రిల్‌లో పోగొట్టుకున్న ఖరీదైన సెల్ ఫోన్‌ను బాధితునికి సంతమాగులూరు ఎస్సై శివకుమార్ బుధవారం అందజేశారు. గుంటుపల్లి హరిబాబు ఏటీఎంలో నగదు డ్రా చేయడానికి వెళ్లి సెల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. ఈ విషయాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు అనంతరం అందించడంతో ఆయన పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, ఉత్తరాయణం అధిక శ్రావణ మాసం కృత్తిక నక్షత్రం ఏకాదశి తిథి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర బుధవారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

సాంకేతికతను అభివృద్ధికి వినియోగించండి



విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందిస్తున్న ఉపాధ్యాయులు

వేటపాలెం: దేశానికి సాంకేతికతను మంచిగా ఉపయోగిస్తే అభివృద్ధి చెందడానికి ఉపయోగపడుతుందని బాపట్ల జిల్లా సమన్వయ కర్త పవని భాను చంద్రమూర్తి పేర్కొన్నారు. కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో హిరోషిమా, నాగసాకి దినోత్సవం సందర్భం బుధవారం జరిగిన అవగాహనా సదస్సులో మాట్లాడారు. సాంకేతికతను చెడుగా ఉపయోగిస్తే వినాశనం కలుగుతుందన్నారు. ఆ పట్టణాలల్లో ఇప్పటికీ పచ్చగడ్డి కూడా మొలవడం లేదని గుర్తుచేశారు. అక్కడ ఎలాంటి జీవులు కూడా మనుగడ సాధించ లేకపోతున్నాయని తెలిపారు. వీటిపై చిత్రలేఖనం, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి బహుమతులు, ప్రశంస పత్రాలు అందజేశారు. హెచ్‌ఎం గుమ్మా శ్రీనివాసరావు, రిసర్స్ పర్సన్ సికిందర్ మార్జాన్, శ్రీరాం శివప్రసాద్, ఉపాధ్యాయులు నిర్మల కుమారి, డేవిడ్, నారత్నం పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభకు ప్రోత్సాహం



కళాశాల యాజమాన్యానికి చెక్కు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

వేటపాలెం: గత ఏడాది పదో తరగతిలో ప్రతిభ కనబర్చి మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు పూర్వ విద్యార్థులు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. బుధవారం స్థానిక బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కాలేజీలో 1992 సంవత్సరం పూర్వ విద్యార్థులు గత ఏడాది పదో తరగతిలో ప్రతిభ కనపర్చిన 8 మంది విద్యార్థులకు ఇంటర్ చదువు కోవడానికి రూ. 66 వేల నగదు ప్రోత్సాహం అందజేశారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఇంటర్ మీడియెట్ ఫీజు, నోట్ పుస్తకాలు అందజేశారు. కళాశాల వైస్ ప్రెసిడెంట్ కోడూరి ఏకాంబరేశ్వర బాబు, ఇన్‌చార్జి సెక్రటరీ చల్లా వసుదేవ రావు, పూర్వ విద్యార్థులు కొత్త వాసు, వడ్డే శేషయ్య, కె. సురేష్, సీహెచ్ శ్రీరామ్, బవనపల్లి విప్రనారాయణ పాల్గొన్నారు.

బొబ్బేపల్లిలో ఆటల పోటీలు



బొబ్బేపల్లిలో ఆటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మార్టూరు: స్వాతంత్య్ర వేడుకల్లో భాగంగా మండలంలోని బొబ్బేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు బాచిన చలపతి ఆధ్వర్యంలో బాలబాలికలకు వక్తృత్వం, వ్యాసరచన, ముగ్గులు, కబడ్డీ తదితర పోటీలను నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు.

వేతనం అందేలా చూడాలి

చినగంజాం: ఉపాధి హామీ పని చేసిన ప్రతి కూలీకి వేతనం అందేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కె. స్వరూపరాణి ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడారు. ఏపీఓ లక్ష్మీదేవి, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రతి పౌరుడు దేశ భక్తి చాటాలి



చీరాల నగర్‌లో ఎఆర్డీవో సరోజిని, జిల్లా ఏడీవో సత్తార్, ఇతర అధికారులు



నూజిళ్ళపల్లిలో నా భూమి నాదేశం కార్యక్రమం

చీరాల టౌన్: తల్లిదండ్రులు, నేలతల్లిపై ప్రేమ, దేశభక్తిని ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని ఆర్డీవో పి.సరోజిని రెడ్డి సూచించారు. బుధవారం చీరాలనగర్, కొత్తపాలెం, గాంధీనగర్ గ్రామ పంచాయతీల్లో ' నాభూమి నాదేశం, నేలతల్లికి నమస్కారం– వీరులకు వందనం । కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి నియోజకవర్గ ప్రత్యేకాధికారి, ఆర్డీఓ సరోజిని, మండల ప్రత్యేకాధికారి, జిల్లా వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ సత్తార్ హాజరయ్యారు. ఆయా గ్రామ పంచాయతీల్లో పర్యావరణ పరిరక్షణలో భాగంగా రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటారు. అలానే ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగాలను నిర్మూలించి పర్యావరణానికి మేలు చేసేలా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శిలాఫలకం ఆవిష్కరణ, జెండా ఆవిష్కరణ, పంచప్రాణ్ ప్రతిజ్ఞ, వసుధకు వందనం, వీరోంక వందనం కార్యక్రమంలో భాగంగా విశ్రాంత సైనికులను సత్కరించారు. అనంతరం ప్రభుత్వ మార్గ దర్శకాలను ప్రజలకు వివరించారు. తహసీల్దార్ జీవిగుంట ప్రభాకర రావు, ఎంపీడీవో నేతాజీ, ఏపీవో దాసు, పంచాయతీ సెక్రటరీ అనీల్‌కుమార్, ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయులు, వలంటీర్లున్నారు.

జె.పంగులూరు: ఎంతో మంది దేశభక్తుల త్యాగ ఫలమే స్వాతంత్య్రం అని ఏపీఎం జ్యోతి ప్రసాద్ అన్నారు. నూజిళ్ళపల్లి, చందలూరు, అలవలపాడు, ఆరికట్లవారిపాలెం, కశ్యాపురం, టి. కొప్పెరపాడు, టి. తక్కెళ్ళపాడులో బుధవారం ఆజాదీకా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా నా భూమి నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎం జ్యోతి ప్రసాద్ మాట్లాడుతూ స్వాతంత్య్రం వచ్చి 75 సంవత్సరాలు పురస్కరించుకొని మృతవీరులను స్మరించుకోవడం పౌరుల బాధ్యతన్నారు. పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ప్రారంభించారు. చందలూరులో జరిగిన కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ప్రసాద్, ఎంపీడీఓ రామాంజనేయులు, తహసీల్దార్ ఐ. పద్మావతి పాల్గొన్నారు.

'నాదేశం.. నామట్టి' ర్యాలీ

కేశవరప్పాడు (కారంచేడు): 'ఆజాదీకా అమృత్ మహోత్సవం' నాదేశం.. నామట్టి కార్యక్రమాలను విజయవంతం చేయాలని బాపట్ల సహకారశాఖాధికారి, మండల ప్రత్యేక అధికారి కేవీ రామారావు అన్నారు. బుధవారం కేశవరప్పాడులో అధికారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. శిలాఫలకాల ఏర్పాటు, పంచప్రాణప్రతిష్ఠ, వసుధ వందనం, మొక్కలు నాటడం, వీరులకు వందనం, జాతీయ జెండాలను ఆవిష్కరణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. తహసీల్దార్ ఎస్. వెంకటరత్నం, ఎంపీడీఓ డి. విజయలక్ష్మి, సర్పంచ్ వెలుగు ధనలక్ష్మి, ఎంఈఓ ఎంవీ సత్యన్నారాయణ, ఏపీఓ ప్రదీప్, ఏపీఎం మధుసూదనరావు, కార్యనిర్వహణాధికారి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వీరులకు వందనం

మేదరమెట్ల: మండలంలోని పలు గ్రామాల్లో నామట్టి–నాదేశం కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు బుధవారం ఘనంగా నిర్వహించారు. నేలతల్లికి నమస్కారం, వీరులకు శిలాఫలకం ఏర్పాటు, మొక్కలు నాటడం, స్వాతంత్య్ర సమరయోధులకు పూలమాలలతో వందనం సమర్పించారు. ఎంపీడీవో సురేష్‌బాబు, ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి, సర్పంచ్ బొనిగల ఎలిశమ్మ, ఈవో శ్రీనివాసరావు, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ వై.రత్నారెడ్డి, ఉప ఎంపీపీ నరేష్‌కుమార్, గ్రామ నాయకులు పాల్గొన్నారు. అనమనమూరులో సర్పంచ్ జంపు హరిబాబు, బొడ్డువానిపాలెంలో సర్పంచ్ నేరెళ్ళ సుబ్బయ్య మొక్కలు నాటారు. రాచపూడిలో ర్యాలీ నిర్వహించారు.

చెరుకూరులో శిలాఫలకం ఆవిష్కరణ

పర్చూరు (చినగంజాం): మండల పరిధిలోని చెరుకూరులో పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ పేరం సుబ్బారావు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడంలో మొక్కలు నాటడం కార్యక్రమాలు నిర్వహించారు. జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైస్ ఎంపీపీ పాలేరు వీరయ్య, ఉప సర్పంచ్ గడ్డం గోపి, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, ఏపీఓ బుల్లిబాబు, నాయకులు కాలేషా, పఠాన్ బాబు, బండారు శ్రీను, వెంకట స్వామి పాల్గొన్నారు.

బల్లికురవ: ప్రభుత్వ చేపట్టిన నామట్టి–నాదేశం కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని బాపట్ల జిల్లా రైతు అధ్యక్షుడు చింతల పేరయ్య కోరారు. బుధవారం వేమవరం, నక్కబొక్కలనపాడు, కొణిదెన, కెరాజుపాలెం, ఉప్పుమాగులూరు, కొపరపాలెం, మల్లాయపాలెంలో పలు కార్యక్రమాలు చేపట్టారు. ఎంపీడీవో సీహెచ్ కృష్ణ, తహసీల్దార్ కె. రవిబాబు, ఎంఈవో రమేష్‌బాబు, ఏపీఎం బి. సరేంద్రబాబు తదితర అధికారులు, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, సర్పంచ్‌లు ఎంపీటీసీలు, సెక్రటరీలు పాల్గొన్నారు.

మార్టూరు: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వెలుగు కార్యాలయం సమీపంలో ఎంపీడీఓ టి. కృష్ణకుమారి ఆధ్వర్యంలో శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎంపీపీ భూక్యా శాంతి బాయి, స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ఎంఈఓ వస్రంనాయక్, తహసీల్దార్ సురేష్ బాబు, ఏపీఎం రాజారత్నం పాల్గొన్నారు.

చినగంజాం: సంతరావూరు, గొనసపూడి, చింతగుంపల్లి, మోటుపల్లి గ్రామ పంచాయతీల్లో జెండాలను ఆవిష్కరించారు. పలు చోట్ల తహసీల్దార్ పి. పార్వతి, ఎంపీడీఓ కె. స్వరూపరాణి పాల్గొన్నారు.

అద్దంకి రూరల్ : అద్దంకి మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ జ్యోతి హనుమంతరావు వేలమూరిపాడులో ర్యాలీ, జ్యోతి ప్రజ్వలన వంటివి నిర్వహించారు. సర్పంచ్ గోపనబోయిన అంజయ్య, ఫారెస్టు ఆఫీసర్ యల్. భీమయ్య తదితరులున్నారు.



మేదరమెట్లలో దేశనాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేస్తున్న అధికారులు



పర్చూరు: శిలాఫలకం వద్ద ప్రతిజ్ఞ నిర్వహిస్తున్న నాయకులు, అధికారులు



బల్లికురవ: వేమవరం సత్కారంలో పాల్గొన్న పేరయ్య, ఎంపీడీవో సీహెచ్ కృష్ణ

మౌలిక వసతుల కల్పనకు చర్యలు



కాలనీ వాసుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బలరామకృష్ణ మూర్తి

వేటపాలెం: నూతనంగా ఏర్పాటు చేసిన కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు అధికారులు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణ మూర్తి సూచించారు. రామాపురం రోడ్డులోగల అబ్దుల్ కలాం కాలనీని అధికారులతో కలిసి ఎమ్మెల్యే బుధవారం సందర్శించారు. కాలనీలో సమస్యలన్నీ త్వరగా పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అధికారులు డి. గోవింద రెడ్డి, ప్రసాద్, శర్మ తదితరులు పాల్గొన్నారులు.

నాణ్యమైన విద్యుత్ కోసం సబ్ స్టేషన్

అద్దంకి: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాను అదించడం కోసమే సబ్‌స్టేషన్ నిర్మాణం చేస్తున్నట్లు రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణ చైతన్య అన్నారు. శంఖవరప్పాడులో బుధవారం రూ.5.6 కోట్లతో నిర్మించ తలపెట్టిన సబ్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. త్రీఫేజ్ సప్‌లై అందుబాటులోకి వస్తుందన్నారు. ఈఈ మస్తాన్‌రావు, విద్యుత్ శాఖ అధికారులు, నాయకులు కామిరెడ్డి, శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.



సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేస్తున్న బాచిన కృష్ణ చైతన్య

ఎమ్మెల్సీ పోతుల సునీతపై వ్యాఖ్యలు ఖండిస్తున్నాం

చీరాల: వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీతపై టీడీపీ చీరాల ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకులు మల్లెల బుల్లిబాబు, దాసరి రూప సుమ ఇతర నాయకులు ఖండించారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

చీరాల ఎమ్మెల్సీ పోతుల సునీతపై టీడీపీ ఇన్‌చార్జ్ కొండయ్య అనుచిత వ్యాఖ్యలు చేయటం సరైన విధానం కాదని, పోలీస్ కుటుంబాలను బాధించిన టీడీపీ నాయకుడు, కార్యకర్తల విధ్వంసకర విధానాలను ఖండిస్తూ ఆమె చేసిన వ్యాఖ్యలపై ఒక మహిళా ఎమ్మెల్సీ అని కూడా చూడకుండా ఇష్టమొచ్చిన రీతిలో ఆమెను మాట్లాడటం తగదన్నారు. చీరాల వైఎస్సార్ సీపీ నాయుకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రానున్నది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే!

– శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణ చైతన్య

మేదరమెట్ల: త్వరలో రానున్న ఎన్నికల్లో మరలా అధికారంలోకి వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే అని శాప్‌నెట్ చైర్మన్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణ చైతన్య అన్నారు. కొరిశపాడు మండలంలోని పమిడిపాడులో మూడో రోజైన బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో పార్టీలకు, కులాలకు, వర్గాలకు తావులేకుండా కేవలం అర్హత ఒక్కటే ప్రామాణికంగా తీసుకొని సంక్షేమ పథకాలను అందిస్తామన్నారు. సామాన్యులకు మేలు చేసే ప్రతి నాయకుడ్ని ప్రజలు గుండెల్లో పెట్టుకుంటారని అలాంటి నాయకునికి ఓటమి ఉండదన్నారు. మండల, స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.



పమిడిపాడులో పర్యటిస్తున్న కృష్ణ చైతన్య

అదుపు తప్పిన బైక్.. ఇద్దరికి గాయాలు

అద్దంకి రూరల్: బైకు అదుపుతప్పి ఇద్దరు యువకులకు గాయాలైన ఘటన బుధవారం అద్దంకి పట్టణంలో చోటు చేసుకుంది. ఒంగోలు సత్యరారాయణపురానికి చెందిన రామకోటయ్య, కొణిజేడుకు చెందిన జార్జిలు బైకు మీద ఒంగోలు నుంచి అద్దంకి మీదుగా వినుకొండ వెళ్లేందుకు వస్తున్నారు. అద్దంకి – నార్కెట్ పల్లి నామ్‌రహదారిపైనున్న ఎస్ ఎస్ లాడ్జి వద్దకు రాగానే బైకు అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొనటంతో కిందపడి గాయాలపాలయ్యారు. 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

చేనేతలకు అండగా సీఎం



మాట్లాడుతున్న బీరక సురేంద్ర

చీరాల: రాష్ట్రంలో చేనేతలకు వెన్నుదన్నుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిలిచారని దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్ర అన్నారు. బుధవారం ఈపూరుపాలెంలో చేనేతలకు 100 యూనిట్లు పవర్ సబ్సిడీ దరఖాస్తుల క్షేత్ర స్థాయి పరిశీలన కోసం విద్యుత్ సిబ్బందితో కలిసి పాల్గొన్న బీరక సురేంద్ర మాట్లాడారు.

100 యూనిట్లు సబ్సిడీ కోసం దరఖాస్తులు పెట్టుకునే అవకాశం ఉందని తెలిపారు. అండగుండా నారాయణ, గంజి సతీష్, ఉడత ప్రసాద్, బీరక సురేష్, యశ్వంతరావు, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత

యద్దనపూడి: మండల పరిధిలోని యనమదల గ్రామానికి చెందిన కటకంశెట్టి కిషోర్‌కుమార్ 42 అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో వైఎస్సార్ బీమా తక్షణసాయం కింద రూ.10 వేలు నగదును మృతుడు తల్లి సామ్రాజ్యంకు ఎంపీడీఓ కృష్ణకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకుడు మారెళ్ల శ్రీధర్ అందజేశారు. మిగతా మెత్తం నగదును ప్రభుత్వం నామిని బ్యాంకు ఖాతాలో త్వరలో జమ చేస్తామన్నారు. సర్పంచ్ రాయి పృధ్వీరాజ్, పంచాయతీ కార్యదర్శి రాణి, వెల్ఫేర్ అసిస్టెంట్ బాజీ పాల్గొన్నారు.

పంట ప్రయోగాలతో లాభం

అద్దంకి: పంట బీమా పథకానికి పంట కోత ప్రయోగాలే కీలకమని మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకట కృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో బుధవారం నిర్వహించిన గ్రామ వ్యవసాయ సహాయకులకు పంట కోత ప్రయోగాలపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పంట కోత ప్రయోగాలు ఎంత కచ్చితమైన ఫలితాలు తీస్తే అంత బాగుంటుందన్నారు. ఏఎస్‌వో అమర్‌నాథ్ మాట్లాడుతూ పంట కోత ప్రయోగాలు ఖచ్చితంగా అమలు చేయాలని చెప్పారు. సంతమాగులూరు ఏఎస్‌వో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పంట కోత ప్రయోగాలు చేసే విధానం ప్లాట్ ఎంపిక గురించి వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

పర్చూరు (చినగంజాం): ఇన్‌స్పైర్ అవార్డుల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పర్చూరు ఉప విద్యాశాఖాధికారి ఆర్. శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం స్థానిక వైఆర్ హైస్కూల్‌లో మాట్లాడుతూ కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రిత్వశాఖ ప్రతి ఏడాది ఇన్‌స్పైర్ అవార్డుల పోటీలను నిర్వహిస్తోందన్నారు. తయారు చేసిన ప్రాజెక్టులను ఆగస్టు 25 వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. జిల్లా స్థాయికి ఎంపికైతే రూ. 10 వేలు, జాతీయ ప్రదర్శనకు ఎంపికైతే రూ. 25 వేలు అదనపు నిధులను కూడా ప్రభుత్వం కేటాయిస్తుందని వివరించారు. జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాదిక్, హెచ్‌ఎం ఈదర రాజశేఖర్, జిల్లా నేషనల్ గ్రీన్ కోర్ కో ఆర్డినేటర్ పావని, భాను చంద్రమూర్తి పాల్గొన్నారు.

చేయూతనివ్వడం అభినందనీయం

బల్లికురవ: వైద్యశాలలో రక్త పరీక్ష చేయటానికి కక్కెర ఫౌండేషన్ సెంట్రీ ఫ్యూజ్ మిషన్‌ రూ. 40 వేలతో అందించటం అభినందనీయమని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికార్లు రమీజ్ అహమ్మద్, భారతి అన్నారు. బుధవారం షుగరు నిర్ధారణతో పాటు 4 రకాల పరీక్షలు చేసేందుకు అవసరమైన యంత్రాన్ని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కక్కెర ఆంజనేయులు అందజేశారు.

పొన్నం ఫౌండేషన్ సహకారం అభినందనీయం



జరుబులవారిపాలెంలో రాత పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ వెంకటేశ్వర్లు

జరుబులవారిపాలెం (కారంచేడు): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అవసరమైన రాత పుస్తకాలు, బ్యాగ్‌లు, డిక్షనరీలు, పెన్నులు వంటి వాటిని ఉచితంగా అందించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం రుబులవారిపాలెంలోని రెండు ప్రాథమిక పాఠశాలలో పుస్తకాలు అందించారు. హైదరాబాద్‌కు చెందిన పొన్నం శివకుమార్ ఫౌంషన్ సహకారంతో అందించిన డైరెక్టర్ పొన్నం వెంకట్రావును త్కరించారు. హెచ్‌ఎంలు అనంత పద్మనాగులు, మండవ ప్రమీల, సీహెచ్ నాగేశ్వరరావు, ఎన్. త్రివేణి పాల్గొన్నారు.

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని రావినూతల గ్రామానికి చెందిన కంచర్ల శ్రీకృష్ణ తన తల్లి సరస్వతమ్మ జ్ఞాపకార్థం స్థానిక ప్రాథమిక పాఠశాలలో రూ.20 వేల విలువ చేసే నోట్ పుస్తకాలను బుధవారం అందజేశారు. ఎంఈవో పున్నయ్య, వీర రాఘవయ్య అభినందించారు. సర్పంచ్ విజయవీణ, కంచర్ల చిన్నబ్బాయి, పుట్టా విజయలక్ష్మి, రిటైర్డ్ హెచ్‌ఎం దామా వెంకట సుబ్బయ్య, హెచ్‌ఎం విజయకుమార్ పాల్గొన్నారు.

వేటపాలెం: విద్యార్థులు చదువుల్లో రాణించాలని పట్టభద్రుల సంఘం అధ్యక్షుడు ప్రతి వెంకట సుబ్బారావు సూచించారు. దేశాయిపేట పంచాయతీ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా పలకలు, నోట్ పుస్త కాలు బుధవారం అందజేశారు. సంఘం కార్యదర్శి సుంకర వెంకటలక్ష్మీ ప్రసాద్, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, శ్రీహరి, శివప్వాతి, చుండూరు మురళీకృష్ణ, మస్తాన్‌రెడ్డి, కుమార్ పాల్గొన్నారు.

అధికారులతో ఆమంచి సమావేశం

మార్టూరు: మండల కేంద్రం మార్టూరు, వలపర్లలో పర్చూరు నియోజక వర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ బుధవారం అధికారులు, స్థానిక నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానిక నాయకులతో సమస్యలను తెలుసుకొని ప్రధానంగా డ్రైనేజ్, విద్యుత్ తదితర సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మార్టూరుకు చెందిన పలు అంశాల గురించి అధికారులతో సమీక్ష నిర్వహించారు.

విద్యుత్ సర్వీసుల తనిఖీ

చీరాల అర్బన్: గ్రామీణ సెక్షన్‌లో విద్యుత్ సిబ్బంది ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. చీరాల డివిజన్ విద్యుత్ ఈఈ కె. సూర్య ప్రకాష్ ఆధ్వర్యంలో సిబ్బంది 36 బృందాలుగా విడిపోయి మొత్తం 2535 సర్వీసులను తనిఖీ చేసి లోడ్ అదనంగా వాడుతున్న 33 సర్వీసులకు రూ. 1,36,000 అపరాధ రుసుం విధించారు. విద్యుత్ విజిలెన్స్ ఈఈ టి. హైమావతి, చీరాల డీఈ టి. శ్రీనివాసరావు, వేటపాలెం డీఈ జె. శ్రీనివాసులు, పూర్చూరు డీఈ రమేష్ , 9 మండలాల ఏఈలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

అద్దంకి రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కవి, ఎల్‌ఐసీ ఉద్యోగి డీపీఎం సత్యనారాయణ అన్నారు. బుధవారం రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ, అద్దంకి ఎల్‌ఐసీ బ్రాంచ్ సంయుక్త ఆధ్వర్యంలో అద్దంకి పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు పుట్టిన రోజు సందర్భంగా స్థానిక కాకానిపాలెం జెడ్పీ హైస్కూల్‌లో వివిధ రకాల మొక్కలు నాటారు. మురళీకృష్ణ, గురవయ్య, మాధవ్‌కృష్ణ, ఖాదర్‌మస్తాన్, మహాదేవయ్య, చప్పిడి వీరయ్య, కొల్లా భువనేశ్వరీ, బావోజీ, సర్పంచ్ అంగలకుర్తి హనుమయ్య పాల్గొన్నారు.

గర్భిణులకు పరీక్షలు అవసరం



కారంచేడులో పరీక్షలు చేస్తున్న డాక్టర్ జెస్సీ రాణి

కారంచేడు: గర్భిణులు క్రమం తప్పకుండా ప్రతి 20 రోజులకోసారి స్థానిక పీహెచ్‌సీల్లో అవసరమైన పరీక్షలు చేయించుకొని ఆరోగ్య నియమాలను పాటించాలని కారంచేడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె. జెస్సీరాణి అన్నారు. బుధవారం కారంచేడు పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుమారు 25 మందికి పరీక్షలు చేశారు. మూడో నెల వచ్చిన వెంటనే మీ సమీప ఆశ, ఏఎన్‌ఎంల వద్ద మీ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. హిమోగ్లోబిన్, బీపీ, షుగర్ వంటి సాధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రక్తహీనతతో ఉండే వారిని మరింత జాగ్రత్తగా పరిశీలిస్తామన్నారు. పాలు, గుడ్లు, ఆకుకూరలు, మాంసకృత్తులు ఉండే ఆహారం క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. హెచ్‌వీలు వసంతవల్లి, వీరమ్మ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో స్వస్థత

బల్లికురవ: వైకల్యం కలిగిన 14 ఏళ్ల లోపు చిన్నారులతో నిత్యవ్యాయామం, ఫిజియోథెరపీ పరీక్షలతో స్వస్థత పొందవచ్చని ఫిజియోథెరపిస్టు ఇందిరా ప్రియదర్శిని అన్నారు. బుధవారం వైదనలోని భవిత కేంద్రంలో 10 మంది చిన్నారులకు పరీక్షలు చేశారు. ప్రతి బుధవారం జరిగే క్యాంపునకు చిన్నారులకు తీసుకురావాలని సూచించారు.

రోడ్ల విస్తరణతో గ్రామాల అభివృద్ధి

పర్చూరు (చినగంజాం): రహదారులను విస్తరిస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని బాపట్ల ఆర్డీఓ రవీందర్ అన్నారు. బుధవారం అన్నంబొట్లవారిపాలెంలో రైతులతో జరిగిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందిస్తామని తెలిపారు. రహదారి నిర్మాణంలో సాగుభూములకు ఇబ్బంది కలగకుండా చూస్తామన్నారు. తహసీల్దార్ కె. సంధ్యశ్రీ, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ రవీందర్, అధికారులు